శ్రేయోదాయకం..దశవిధహారతులు

- శ్రీగిరిలో వైభవంగా కార్తీకమాసోత్సవాలు
- దశవిధ హారతుల దర్శనంతో పుణ్యఫలం
- కార్తీకమాసంలో ప్రతి సోమవారం దశ విధహారతులు

శ్రీశైలంటెంపుల్: పరమేశ్వరుడికి అత్యంత ప్రీతికరమైన మాసం కార్తీకమాసం. ఈ మాసంలో శివున్ని ఆరాధిస్తే సకల శుభాలు కలుగుతాయని భక్తుల విశ్వాసం. అంతే కాకుండా ఈ మాసంలో దీపారాధన వలన కూడాఅనేక శుభాలు కలుగుతాయి. కేవలం దీపారాధనే కాకుండా దీప దర్శనంతో కూడ శివానుగ్రహం లభిస్తుంది. శ్రీగిరిలో జరుగుతున్న కార్తీకమాసోత్సవాల్లో ప్రతి సోమవారం లక్ష దీపోత్సవం, పుష్కరిణికి దశవిధ హారతుల కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్నారు. దశ విధహారతుల కార్యక్రమంపై ప్రత్యేక కథనం..

ఈ మాసంలో పరమేశ్వరుడిని మారేడు దళాలతో, కేశవుడిని తులసీఆకులతో అర్చన చేస్తారు. శ్రీగిరి క్షేత్రంలో కార్తీకమాసాన్ని పురస్కరించుకుని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులకు అనుగుణంగా దేవస్థానం ఏర్పాట్లు చేసింది. ఈ మాసంలో ఆలయాల్లో ఆకాశదీపాన్ని వెలిగించడం అనవాయితీ. అలాగే ఆలయ పరిసరాల్లో భక్తులు కార్తీక దీపాలను వెలిగిస్తారు. దీపారాధన వలన కష్టాలు నివారించబడి, ఐశ్వర్యం లభిస్తుంది. పాపాలన్నీ తొలగిపోయి పుణ్యం లభిస్తుంది. కార్తీకదీప దర్శనం వలన మానవులు, పక్షులు, కీకాలు, దోమలు, జలచరాలైన చేపలు, వృక్షాలు మొదలైన వాటికి పునర్జీవం ఉండదని పురాణాలు చెబుతున్నాయి.


శ్రీశైల ఆలయం

శ్రీగిరిలో ప్రత్యేకంగా..

కార్తీకమాసంలో శ్రీశైలంలో ప్రత్యేకంగా ఆలయ పుష్కరిణి వద్ద ప్రతి సోమవారం, కార్తీక పౌర్ణమి రోజున విశేష పూజలు నిర్వహిస్తారు. అలాగే లక్షదీపోత్సవ కార్యక్రమం, పుష్కరిణికి దశ విధహారతులు ఇస్తారు. ఉభయ దేవాలయాల ప్రధాన అర్చకులు ఈ కార్యక్రమంలో పాల్గొని శాస్త్రోక్తంగా హారతులిస్తారు.

దశవిధహారతులు..వాటి పుణ్యఫలం

ఓంకారహారతి..



పరబ్రహ్మ స్వరూపమైన బీజాక్షరమే ఓంకారం. ఓంకార హారతిని దర్శించడం వలన కష్టాలన్నీ నివారించబడి సకల శుభాలు కలుగుతాయి.

నాగహారతి..



ఈ హారతిని దర్శించడం వలన సర్పదోశాలు తొలగి, సంతానం కలుగుతుంది.

త్రిశూలహారతి..



ఈ హారతిని దర్శించడం వలన అకాలమరణం తొలగిపోతుంది. గ్రహదోషాలు నివారించబడతాయి.

నందిహారతి..



ఈ హారతిని దర్శించడం వలన భయం, దుఃఖము ఉండదు. ఆనందం, ఉత్సాహం లభిస్తాయి.

సింహ హారతి..



సింహ హారతిని దర్శించడం వలన శత్రుబాధలు తొలగి, మనోధైర్యం కలుగుతుంది.

సూర్యహారతి..



సూర్యహారతిని దర్శించడం వల్ల ఆరోగ్యం చేకూరుతుంది. దీర్ఘాయుష్షు లభిస్తుంది.

నక్షత్రహారతి..



నక్షత్రహారతిని దర్శించడం వలన జాతక దోషాలు తొలగి, చేపట్టిన పనుల్లో విజయం లభిస్తుంది.

చంద్రహారతి..



చంద్ర హారతిని దర్శించడం వలన మనఃశుద్ధి కలిగి ఈర్శ్య, అసూయ ద్వేషాలు తొలగిపోతాయి. మానసిక ప్రశాంతత లభిస్తుంది.

కుంభహారతి..



కుంభహారతిని దర్శించడం వలన కోరికలు నెరవేరుతాయి. సంపదలు కలుగుతాయి.

కర్పూరహారతి..



ఈ హారతిని దర్శించడం వల్ల పాపాలన్నీ తొలగిపోతాయి. యజ్ఞ ఫలంతో పాటు అష్టైశ్వర్యాలు సిద్దిస్తాయి.

భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం



శ్రీశైలక్షేత్రం అధ్యాత్మిక కేంద్రగా వెలసిల్లుతుంది. కార్తీకమాసంలో మల్లన్న దర్శించుకునేందుకు అధికసంఖ్యలో భక్తులు తరలివస్తారు. రద్దీ రోజుల్లో కూడా భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా సిబ్బందికి, అధికారులకు ప్రత్యేక విధులు కేటాయించాం. ప్రతి ఒక్క భక్తుడికి సౌకర్యవంతమైన స్వామిఅమ్మవార్ల దర్శనాన్ని కల్పిస్తాం. ఈ మాసంలో ప్రతి సోమవారం లక్షదీపోత్సవం, పుష్కరిణికి దశవిధ హారతులు శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్నాం. ఈ మాసంలో దీపారాధనతో పాటు, దీపదర్శనంతో కూడా ఎంతో విశేషం.

– డి.పెద్దిరాజు, శ్రీశైల దేవస్థాన ఈఓ

క్లుప్తంగా

కుమారస్వామికి విశేష పూజలు



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో ఆదివారం షష్టి సందర్భంగా అర్చకులు విశేష క్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకం, సుబ్రహ్మణ్య, అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణలు చేశారు. సుబ్రహ్మణ్యస్వామి వారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేకం జరిపించారు.

మల్లన్న సేవలో..


సెంట్రల్‌బోర్డు డైరెక్ట్ ట్యాక్సెస్ మెంబర్‌కు ఆహ్వానం పలుకుతున్న ఈఓ

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామివార్లను సెంట్రల్‌బోర్డు డైరెక్ట్ ట్యాక్సెస్ మెంబర్ ప్రజ్ఞాసాహే సక్సేనా ఆదివారం దర్శించుకున్నారు. వీరికి ప్రధానాలయ రాజగోపురం వద్ద ఈఓ డి.పెద్దిరాజు, అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. వీరు స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం అమ్మవారి ఆశీర్వచన మండపంలో అర్చక, వేదపండితులు ఆశీర్వచనాలు పలుకగా, ఈఓ స్వామివార్ల శేషవస్త్రాలు, లడ్డూప్రసాదం అందజేశారు.

శుభకార్యం


వధూవరులతో ఎమ్మెల్యే శిల్పా

ఆత్మకూరు: పట్టణంలోని ఎండబ్ల్యూ ఫంక్షన్ హాల్ నందు ఆదివారం కరివేన గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కట్టమీది వెంకటేశ్వర్లు కుమార్తె వివాహ వేడుకకు ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన నూతన వధూవరులను ఆశీర్వదించారు. నాయకులు సురేష్, బాలస్వామియదవ్, లక్ష్మమ్మ, నవాబ్, రమణ, శంకర్, వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల అధ్యక్షుడు సయ్యద్ మీర్, రాజమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి


ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎంపీటీసీ

పాములపాడు: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఎంపీటీసీ సభ్యురాలు నల్లమల రమాదేవి అన్నారు.గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. లైబ్రేరియన్ క్రిష్టారెడ్డి, పాఠకులు పాల్గొన్నారు.

పంటల చుట్టూ కరెంట్ తీగలు ఏర్పాటు చేయొద్దు

కొత్తపల్లి: పంట పొలాలను అడవిపందుల నుంచి కాపాడుకునేందుకు పొలాల చుట్టూ కరెంట్ తీగలను రక్షణగా ఏర్పాటు చేసుకోరాదని ఆత్మకూరు సర్కిల్ సీఐ నాగభూషణ్ ఆదివారం తెలిపారు. రైతులు పంటలను కాపాడుకొవడంలో భాగంగా పొలాల వద్ద అక్రమంగా విద్యుత్ తీగలు చుడుతుండటంతో వాటిని తగిలి రైతులు మృత్యువాత పడుతున్నారన్నారు. శుక్రవారం కొక్కెరంచ గ్రామ శివారులో మిరప పంటను అడవి పందుల నుంచి కాపాడుకొనే నెపంతో హుసేన్ అనే రైతు కరెంటు తీగను పొలం చుట్టూ ఏర్పాటు చేసి గ్రామానికి చెందిన ఈడిగ నాగేశ్వరగౌడ్ అనే రైతు మరణానికి కారణమయ్యారని తెలిపారు. ఇదే తరహాలో సెప్టెంబర్ నెలలో దుద్యాల గ్రామ సమీపంలో కూడా పొలంలో అవగాహన లేక రైతులు పంటను కాపాడుకోవాలని జీఏ వైరు ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరా చేయడంతో ఓ రైతు మృత్యువాత పడ్డాడని వివరించారు. ఇలా తీగలు ఏర్పాటు చేసే రైతులపై నాన్‌బెయిలబుల్ కేసు పెడతామని హెచ్చరించారు. ఇలా చేయడం చట్టరీత్యా నేరమన్నారు.

నేడు కార్తీక వనభోజనం

ఆత్మకూరు: పట్టణంలోని శ్రీశైలం రహదారిలోని ఆటోనగర్ సమీపంలోనున్న మామిడితోటలో సోమవారం కార్తీక వన భోజన మహోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఆత్మకూరు పురపాలక సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని చెప్పారు.

తప్పిన ముప్పు

మహానంది: స్థానిక పెద్దకోనేరులో స్నానమాచరించేందుకు వెళ్లిన ఓ భక్తుడికి ప్రాణాపాయం తప్పింది. తెలంగాణకు చెందిన భక్తుడు స్నానమాచరించేందుకు కోనేరులోకి దూకాడు. అయితే వెంటనే మరో భక్తుడు ఆయనపై దూకడంతో ప్రమాదవశాత్తు మునిగిపోయి అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. వెంటనే తోటి భక్తులు గమనించి ఒడ్డుకు తీసుకొచ్చి ప్రాథమిక చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించడంతో వైద్యులు చికిత్స చేశారు. దీంతో ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు.

మహానందీశ్వరుడి సన్నిధిలో..


ఏపీ హైకోర్టు రిజిస్ట్రార్ నరసింహులును సన్మానిస్తున్న ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి


మహానందీశ్వరస్వామి దర్శనార్థం వచ్చిన సీఐడీ ఎస్పీ నగేష్, కుటుంబ సభ్యులు

మహానంది: మహానందీశ్వరుడి సన్నిధిలో ఆదివారం పలువురు ప్రముఖులు పూజలు నిర్వహించారు. ఏపీ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ నరసింహారావు కుటుంబ సభ్యులతో కలిసి వచ్చారు. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి వారికి స్వాగతం పలికి పూజలు నిర్వహింపజేశారు. అలాగే కర్నూలు జిల్లా న్యాయమూర్తి ఎస్. శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జీలు రాధారాణి, వి.ఆదినారాయణ, ఏడీజే జి.అర్చన పూజలు చేపట్టారు. స్థానిక అలంకార మండపంలో వారికి శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వరస్వామి వారి ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేయించారు. అలాగే.. సీఐడీ ఎస్పీ నగేష్, కుటుంబ సభ్యులు పూజలు నిర్వహించారు. దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ ఇన్‌స్పెక్టర్ ముడియం చంద్రశేఖర్‌రెడ్డి స్వాగతం పలికారు. ఈ మేరకు వారు శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వర స్వామి వార్లను దర్శించుకుని పూజలు చేపట్టారు. అనంతరం స్థానిక యాగశాలలో వారికి స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేయించారు. వారి వెంట హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి అదృశ్యంపై ధర్నా


కేజీ రోడ్డుపై ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘాలు, విద్యార్థి బంధువులు

పాములపాడు: స్థానిక వివేకానంద స్కూల్‌లో 5వ తరగతి చదువుతున్న విద్యార్థి విష్ణువర్ధన్ అదృశ్యంపై ఆదివారం కేజీ రోడ్డుపై కుటుంబ సభ్యులు, బంధువులు, విద్యార్థి సంఘాలు ధర్నా చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కుమార్, పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు మద్రిస్వామి, ఏఐఎస్ఏ జిల్లా కార్యదర్శి నాగార్జున మాట్లాడుతూ విద్యార్థి అదృశ్యమై రెండు రోజులు గడుస్తున్నా పాఠశాల యాజమాన్యం స్పందించడం లేదని మండిపడ్డారు. ఇంత వరకు విద్యార్థి ఆచూకీ తెలియకపోవడం బాధాకరమన్నారు. పోలీసు అధికారులు తక్షణమే చర్యలు తీసుకొని విద్యార్థి ఆచూకీ కనిపెట్టాలని కోరారు. ధర్నా విరమించాలని పోలీసులు ఎంత నచ్చజెప్పినా ససేమిరా అనడంతో ఆత్మకూరు సీఐ నాగభూషణం, ఎస్ఐలు అశోక్, నారాయణరెడ్డి, కృష్ణమూర్తి.. సిబ్బందితో చేరుకొని ధర్నా చేస్తున్న వారిని చెదరగొట్టి ట్రాఫిక్ క్లియర్ చేశారు.

ఆటో డ్రైవర్‌పై దాడి-పోలీసులకు ఫిర్యాదు

పగిద్యాల: కూలి అడిగిన ఆటో డ్రైవర్‌పై దాడి చేసి గాయపరిచిన ఘటన ఆదివారం రాత్రి లక్ష్మాపురం గ్రామంలో చోటుచేసుకుంది. భాస్కరాపురం గ్రామానికి చెందిన దివ్యాంగుడైన చెంచయ్య పొలం పనులకు ఆటోలో కూలీలను తరలించి వచ్చే బాడుగ డబ్బులతో బతుకుబండిని లాగిస్తున్నాడు. అయితే నాలుగు నెలల క్రితం లక్ష్మాపురం గ్రామానికి చెందిన బుడగజంగాల చంద్రమోహన్ పొలానికి కూలీలు కావాలని కోరడంతో మిరప చేనులో పనులు చేసేందుకు ఒక్కొక్కరికి రూ. 250ల చొప్పున కూలి చెల్లిస్తానని ఒప్పుకుని 14 మంది కూలీలను ఆటోలో తరలించాడు. కూలీలకు చెల్లించాల్సిన రూ. 3,500 ఇవ్వకుండా కాలయాపన చేస్తుండటంతో చంద్రమోహన్‌ను ఆటో డ్రైవర్ నిలదీయడంతో ఆయనపై దాడి చేశాడు. డబ్బులు ఇవ్వనని బెదిరింపులకు పాల్పడడంతో బాధితుడు ముచ్చుమర్రి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితున్ని పోలీసులు చికిత్స నిమిత్తం నందికొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పరిశోధనలతో మార్గ నిర్దేశం


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అధ్యాపకులు

నంద్యాల(న్యూటౌన్): పరిశోధనలు అధ్యాపకులకు మార్గం నిర్దేశం చేస్తాయని, విద్యారంగంలోనే కాకుండా పరిశోధన రంగంలో కూడా ప్రావీణ్యత సంతరించుకొనుటకు దోహదపడుతాయని రామకృష్ణ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి, డాక్టర్ కృపశంకర్ గుప్త పేర్కొన్నారు. ఆదివారం శ్రీ రామకృష్ణ పీజీ కళాశాలలో అధ్యాపకులకు పరిశోధన పత్రాల ప్రచురణలో మెళకువలు అనే అంశంపై మూడు రోజుల ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ఏర్పాటు చేశారు. ముందుగా ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు నివాళులర్పించారు. అనంతరం ఎంపవర్‌మెంట్ కాన్సెప్ట్ అండ్ అప్లికేషన్ ఇన్వెస్ట్‌మెంట్ ఫర్ సెల్ఫ్ ట్రాన్స్‌ఫర్మేషన్ అనే పుస్తకాన్ని విడుదల చేశారు. వారు మాట్లాడుతూ 1857 తిరుగుబాటులో ఝాన్సీ రాణి కీలక పాత్ర పోషించిందన్నారు. అధ్యాపకులు విద్యార్థులకు నూతన విద్యావిధానం అవలంభించడానికి పరిశోధనలు ఎంతో ఉపయోగపడుతాయని చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ సుబ్బయ్య పాల్గొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

అందంగా..రక్షణగా


చాకరాజువేముల వద్ద మిరప పంటలో వేసిన బంతిపూలు

దొర్నిపాడు: సాధారణంగా మిరప పంటలో బంతిపూలను చూస్తుంటాం. చాలా మంది పూలకోసమే లేదా పంటకు దిష్టి తగలకుండానో, అందంగా ఉండాలనో వేస్తారని అనుకుంటారు. కానీ బంతిపూలు సాగుచేయడం వల్ల పొగాకు లద్దెపురుగు, రసంపీల్చే పురుగు, శనగపచ్చ పురుగులు పంటను ఆశించవు. బంతి పూలు లేకపోతే ఈ పురుగులు మిరప ఆకులను ఆశిస్తాయి. ఆకులను తినేస్తే కిరణజన్య సంయోగక్రియ జరగక పంట దెబ్బతింటుంది. దీంతో మిరప పంటకు రక్షణగా.. అందంగా పురుగులను ఆకర్షించేలా ఉంటుండటంతో బంతిపూలను ఎర పంటగా వేస్తారు. అయితే పచ్చని ఆకులతో నిండుగా ఉండే మిరప తోటలో పసుపు, నారింజ రంగు పూలతో తోటకు అందం తెస్తాయి. రక్షణగా, అందంగా ఉంటూ రైతన్న మేలు చేకూరుస్తుందని వ్యవసాయాధికారి సునీత పేర్కొన్నారు.

నేటి నుంచి కులగణనపై శిక్షణ

పగిద్యాల: స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో కులగణన సర్వేపై గ్రామ వలంటీర్లకు సోమవారం శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వెంకటరమణ ఆదివారం తెలిపారు. ఇందుకు వలంటీర్లను 3 గ్రూపులుగా విభజించామని, ఈ నెల 22వ తేదీ వరకు శిక్షణ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. శిక్షణకు ప్రతి వలంటీర్ తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు.

నేడు 'పల్లెకు పోదాం'

నందికొట్కూరు రూరల్ : మండలంలోని కోనేటమ్మపల్లె గ్రామంలో సోమవారం పల్లెకు పోదాం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు రవియాదవ్ ఆదివారం తెలిపారు.

జూపాడుబంగ్లా: మండలంలోని తంగడంచ గ్రామ సచివాలయం వద్ద సోమవారం పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సూర్జహాన్, ఈఓపీఆర్డీ మధుమోహనచక్రవర్తి తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ సర్పంచ్ ఈదుల ఈశ్వరరెడ్డి అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు. మధ్యాహ్నం 3 నుంచి 5గంటల వరకు నిర్వహించే కార్యక్రమంలో సంక్షేమ పథకాల వివరాలను డిజిటల్ బోర్డు ద్వారా ప్రజలకు వివరిస్తామని చెప్పారు.

నేడు 'పల్లెకు పోదాం'

మహానంది: మహానంది, సంతజూటూరు గ్రామాల్లో సోమవారం పల్లెకు పోదాం, వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు మహానంది, బండిఆత్మకూరు మండలాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు కొమ్మా మహేశ్వరరెడ్డి, బారెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు ఉంటాయని, ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు కార్యక్రమానికి హాజరు కావాలని వారు కోరారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

నందికొట్కూరు: పట్టణంలోని పగిద్యా రోడ్డులో ఉన్న పోలేరమ్మ గుడి స్థలాన్ని కబ్జా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకుడు పకీక్కీర్‌సాహెబ్ కోరారు. ఆదివారం పట్టణంలోని పలువురు భక్తులతో కలిసి ఆక్రమణకు గురైన స్థలాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలోని షికారుల ఇష్టదైవమైన పోలేరమ్మ ఆలయ స్థలాన్ని లాక్ డౌన్ సమయంలో షేక్‌మోజస్‌బాషా అక్రమంగా రిజిష్టర్ చేయించుకున్నారని ఆరోపించారు. ఎస్ఐ రమణ సంఘటనా స్థలానికి చేరుకొని భక్తులతో మాట్లాడారు. పరిశీలించి న్యాయం చేస్తామని చెప్పారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

నందికొట్కూరు: మార్కెట్ యార్డు వద్ద బైక్ అదుపు తప్పి కిందపడి గాయపడిన వృద్ధుడు చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి మృతి చెందాడు. ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపిన వివరాల మేరకు.. పట్టణానికి చెందిన సోమిశెట్టి వీరప్ప, భార్య శివానందమ్మ మార్కెట్ యార్డు వద్ద బైక్ అదుపు తప్పిన ఘటనలో తీవ్రగాయాలపాలయ్యారు. క్షతగాత్రులను కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. భార్యభర్తలిద్దరికీ వైద్యులు చికిత్సలు అందించారు. అయితే వీరప్ప చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. కుమారుడు లింగేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

వేతనాలు పెంచాలి

నంద్యాల(న్యూటౌన్): అంగన్‌వాడీ కార్మికుల వేతనాలు పెంచాలని, చర్యలు తీసుకోకపోవతే డిసెంబర్ 8న నిరవధిక సమ్మెకు సిద్ధం కావాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లలితమ్మ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ నవంబర్ 20న జిల్లా పీడీ, సీడీపీఓలకు సమ్మె నోటీసులు ఇస్తున్నామని, 23వ తేదీన అన్ని జిల్లా కేంద్రాల్లో ప్రజా సంఘాలతో కలిసి రౌండ్ టేబుల్ సమావేశాలు, 25 నుంచి 30వ తేదీ వరకు సెక్టార్ సమావేశాల నిర్వహిస్తామన్నారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, వర్కర్లకు, సహాయకులకు, మినీ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. విధులు నిర్వహిస్తూ మృతి చెందిన వారి కుటుంబానికి రూ. 5లక్షలు ఇచ్చి ఉద్యోగం కల్పించాలన్నారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సుంకయ్య,. రమేష్ బాబు,బాలకృష్ణ శ్రీనివాసులు, అబ్బాస్, భాస్కర్, మాణిక్యం, తిరుపాలమ్మ పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి..


ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకులు

వెలుగోడు: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పాలనకు ఆకర్షితులై టీడీపీ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలోకి చేరుతున్నారు. గతవారం పలువురు పార్టీలో చేరగా ఆదివారం పట్టణంలోని జండాపేటలోని టీడీపీ నాయకులు యూసఫ్ తోపాటు 40 కుటుంబాలు ఎమ్మెల్యే శిల్పాచక్రపాణి రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. యూసఫ్ మాట్లాడుతూ.. జగనన్న సంక్షేమ పథకాలు ఆకర్షితులమై నియోజకవర్గంలో చక్రపాణిరెడ్డి చేస్తున్న అభివృద్ధిని చూసి టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలోకి చేరామన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా టీడీపీలో ఉన్నామని, అయితే జగనన్న నాలుగున్నర సంవత్సరాల్లో అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అద్భుతమన్నారు. ముఖ్యంగా మా పిల్లల భవిష్యత్ పట్ల చిత్తశుద్ధితో పాలన సాగిస్తున్నారని, వారికి మద్దతుగా నిలవాలని ముందుకు వచ్చినట్లు చెప్పారు. పార్టీలో చేరిన వారిలో యూనిస్, ఖాసీం బేగ్, యూసుఫ్, సిరాజ్, మున్నా, సలాం, నాగరాజు తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ లాలం రమేష్, సర్పంచ్ జయపాల్, జేసీఎస్ ఇన్‌చార్జ్ దేశం తిరుపంరెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఇలియాస్ ఖాన్, మండల కార్యదర్శి కే.రామ్మోహన్‌రెడ్డి, గోవిందు, రమణ, వెంకట్‌రెడ్డి, అచ్చయ్య పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో కార్తీక పూజలు


నూతన వస్త్రాలతో అమ్మవారిని అలంకరించిన దృశ్యం


అక్షరాభ్యాసం చేయిస్తున్న పురోహితులు

కొత్తపల్లి: కార్తీక మాసం సందర్భంగా మండలంలోని పలు ఆలయాల్లో భక్తులు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఆదివారం సెలవు రోజు కావడంతో మండలంలోని కొలనుభారతిదేవి క్షేత్రంలో భక్తులు విశేష పూజలు నిర్వహించుకునేందుకు తరలివచ్చారు. ఆలయ పురోహితులు అమ్మవారిని నూతన వస్త్రాలతో అలంకరించి విశేష పూజకార్యక్రమాలు చేపట్టారు. అలాగే పలువురు చిన్నారులకు బీజాక్షరాలు దిద్దించి అక్షరాభ్యాసం చేయించారు.

స్త్రీలకు అభయ హస్తం 'దిశ' చట్టం


కవయిత్రిని సన్మానిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): దిశ చట్టంతో స్త్రీలకు రక్షణ కవచం లభించిందని ఇన్‌చార్జ్ గ్రంథాలయాధికారి శ్రీధర్ పేర్కొన్నారు. గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం స్థానిక కార్యాలయంలో దిశ చట్టం– మహిళా సాధికారితపై చర్చ కార్యక్రమం నిర్వహించారు. సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసమూర్తి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ అతివలలో నిబిడీకృతమైన అపార శక్తి సామర్థ్యాల ఆవిష్కరణ దిశగా ప్రభుత్వాలు మహిళలను ప్రోత్సహించాలన్నారు. తెలుగు భాషా సంస్కృతి వికాసానికి గ్రంథాలయాలు దోహదపడుతాయన్నారు. అనంతరం కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులను సన్మానించారు.

హిందూ ధర్మం సనాతనమైనది


నగర సంకీర్తనలో పాల్గొన్న సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులు

నంద్యాల(వ్యవసాయం): హిందూ ధర్మం ఎంతో పురాతనమైన, సనాతనమైనదని సాంస్కృతిక సంప్రదాయాలకు నిలయం మన దేశమని శ్రీశైలం రుషి సంస్కృతి ప్రచార సేవా సంస్థ, ఆధ్యాత్మిక గురువు శ్రీనివాసమూర్తి పేర్కొన్నారు. ఆదివారం హిందూ ధర్మా సమ్మేళన కార్యక్రమాన్ని పురస్కరించుకొని పట్టణంలో నగర సంకీర్తన నిర్వహించారు. అనంతరం వివేకానంద ఆడిటోరియంలో సమ్మేళన కార్యక్రమం చేపట్టారు. కొలనుభారతి శారదా పీఠం పీఠాధిపతి శ్రీ శివయోగేంద్ర సరస్వతి స్వామి మాట్లాడుతూ హిందువుల వేదసంపద అమూల్యమైనదని, వేదాంత శాస్త్రం, తత్వ శాస్త్రం, పురాణాలు, ధర్మాన్ని ఆచరించడానికి కావాల్సిన లోతైన జ్ఞానాన్ని హిందూ ధర్మశాస్త్రం విషదీకరిస్తుందన్నారు. సమరసత సేవా ఫౌండేషన్ నంద్యాల అధ్యక్షుడు చింతలపల్లె వాసు, రామకృష్ణ డాక్టర్ రామకృష్ణారెడ్డి, వెంకటరామిరెడ్డి, సురేంద్రాజీ, మాధవ రెడ్డి, దాసరి శ్రీనివాసులు, అపర్ణ దీపిక పాల్గొన్నారు.

సాహిత్యంతోనే సమాజాభివృద్ధి


పుస్తకాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): సాహిత్యంతోనే సమాజ అభివృద్ధి మొదలవుతుందని ఉర్దూ అకాడమీ మాజీ చైర్మన్ నౌమాన్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎన్‌జీవో కాలనీలోని నేషనల్ పీజీ కళాశాలలో మురసం ఆధ్వర్యంలో షేక్ అబ్దుల్ సమ్మద్ రచించిన మూడు పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ పుస్తక పఠనంను ప్రతి ఒక్కరూ అలవాటు చేసుకోవాలని కోరారు. జాతీయ ముస్లిం రచయితల సంఘం అధ్యక్షుడు కవి కరీముల్లా మాట్లాడుతూ కవులు అణగారినవర్గాల వారిని చైతన్యం చేసేలా రచనలు చేయాలన్నారు. కవి అబ్దుల్ సమ్మద్ రచించిన అబాబీలు (క్షిపణి), అంతర్ వేదన కథలు, ఇస్లాం తరంగాల పుస్తకాలు ఎంతో మందికి ఆదర్శంగా మారుతాయన్నారు. మురసం జిల్లా అధ్యక్షుడు రఫీ, ప్రధాన కార్యదర్శి మహబూబ్‌బాషా, అరసం ముర్తుజా, రామచంద్రారావు పాల్గొన్నారు.